www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 103  గురువారం, ఆగస్టు 27, 2026 , పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## పెట్టుబడులను ఆకర్షించేలా
# ఇన్వెస్ట్ తెలంగాణ

నిపుణులతో కమిటీల ఏర్పాటు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




# కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

- మంత్రి వాకిటి శ్రీహరికి సీఎం అభినందనలు



**హైదరాబాద్,ఆగస్టు 26 :** యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రపంచంలోనే అత్యున్నత పని తీరు కలిగిన క్రీడలకు ప్రముఖ సంస్థల్లో ఒకటైన కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ (కెఎన్ఎస్ యూ) తో ఎంఓయూ కుదుర్చుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో తన దక్షిణ కొరియా పర్యటనలో కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అధ్యక్షులు మూన్ వోన్-జే తో సహా ఉన్నత ప్రతినిధి బృందాన్ని కలిశానని గుర్తు చేశారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, కెఎన్ ఎస్ యూమధ్య భాగస్వామ్యం కోసం తాము వివరంగా చర్చించినట్టు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఇప్పుడు కేవలం ఒక ఎంఓయూ కంటే ఎక్కువ. ఇది తెలంగాణ క్రీడా ప్రతిభకు, అథ్లెట్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్,

మిగతా2లో...




## నేపాల్‌లో ఆకస్మిక
# వరదలు

- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భారతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి



**హైదరాబాద్,ఆగస్టు 26 :** కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నా యి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల మిగతా2లో...

# ఇందిరమ్మ ఇండ్లు.. ఫైనల్ బిల్లులను మేమే చెల్లిస్తాం: పొంగులేటి



**హైదరాబాద్,ఆగస్టు 26 :** పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా రాష్ట్ర ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం నుంచి మిగతా2లో...

## కోదాడ వద్ద ఘోర రోడ్డు
# ప్రమాదం

ఆగివున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణంమృతులంతా ఎపికి చెందిన వారిగా గుర్తింపు - ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం...







## వృద్ధులు లక్ష్యంగా
# సైబర్ ముఠాలు

- సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెర
- అప్రమత్తంగా ఉండాలన్న సిపి సజ్జనార్

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

- కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి
- గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్, ఆగస్టు 26 :** నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు జరిగాయి. కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని, గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. ఉత్సవాల్లో భాగంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది. అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు

మిగతా2లో...



## అమెరికా ఘోర రోడ్డు
# ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు....ముగ్గురు దుర్మరణం

నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

**నిజామాబాద్, ఆగస్టు 26 :** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు కుటుంబసభ్యులకు మిగతా2లో...

## 22ఎను వెంటనే
# తొలగించాలి

లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం

భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ

రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ

బిఆర్ఎస్ నేత హరీస్ రావు విమర్శలు



# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

**ఖాట్మండు ఆగస్టు 26 :** నేపాల్‌లో మెరుపు వరదలు భీభత్సం సృష్టించడంతో భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. ఈ ఘటనలో కనీసం 95 మంది మృతి చెందినట్టు నిర్ధారణ కాగా, 400 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో కనీసం 133 మంది భారతీయులున్నారు. అనేక భవనాలు, వాహనాలు, ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురదలో ఇంకా అనేక మంది కూరుకుపోయినట్టు అంచనా వేస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, భూకంపం, ఆపై కొండచరియలు విరిగిపడటంతోనే భోటెకోశీ నది ప్రళయానికి కారణమని నేపాల్ విదేశాంగ శాఖ శిశిర్ ఖనాల్ వెల్లడించింది. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో భూకంపం వచ్చిందని, దాంతో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు. నదీ ప్రవాహానికి కొండచరియలు అడ్డుపడటం ఆకస్మిక వరదలకు కారణమైనట్టు తెలుస్తోందని చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం, బుధవారం ఉదయం 9 గంటల సమయంలో టిబెట్ వైపు నుంచి వచ్చిన ఉద్ధృతి భోటేకోశి నదిలోకి చేరింది. దీంతో టిమురే, స్యాఫ్రు బేస్ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. గ్యిరాంగ్ సరిహద్దు క్రాసింగ్ సమీపంలోని టిబెట్ ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా, మరికొందరు గల్లయంతయ్యారని చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్హువా వార్త సంస్థ తెలిపింది. నేపాల్–టిబెట్ సరిహద్దుకు చైనా వైపు ఏర్పాటు చేసిన భద్రతా కమెరాల్లో భారీగా రాళ్లు, నీటితో కూడిన వరద ప్రవాహం ఈ ప్రాంతాన్ని ముంచెత్తడానికి కొన్ని క్షణాల ముందు ప్రజలు పరుగులు తీస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం ఆ వరద భవానాలు, వాహనాలను ధ్వంసం చేసిన పలువురు ప్రాణాలను బలిగొంది. కొండ చరియలు విరిగిపడడానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియనప్పటికీ.. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్స్ (జీఎఫ్‌జడ్) ఆసక్తికరమైన విషయం వెల్లడించింది. భద్రతా కెమెరాలో దృశ్యాలు కనిపించిన సమయానికి సుమారు ఏడు నిమిషాలకు ముందు 4.4 తీవ్రతో భూమి కంపించినట్టు జీఎఫ్‌జడ్ తెలిపింది. భూకంపం అనంతరం కొండచరియలు విరిగిపడటం, టిబెట్ నుంచి వచ్చిన ఉద్ధృతి భోటెకోశి నదిలోకి చేరడంతో నేపాల్‌లో భారీ విలయం సంభవించిందని చెబుతున్నారు. మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ వ్యాఖ్యలు చేసింది. ఎ–లాన్–బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను' అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడచైర్మన్ కేశ వెను, శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ ,
జావిద్ అక్రమ్, కూద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# 22ఎను వెంటనే తొలగించాలి

**హైదరాబాద్,ఆగస్టు 26 :** కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22–ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22–ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22–ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22–ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది.

కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూ ర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరా బాద్‌లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు.

# వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

**హైదరాబాద్,ఆగస్టు 26 :** హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల ని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొ దట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని కెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్‌లో మొబైల్ ఎఓఇఎ నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి' అని సీపీ సూచించారు.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**సూర్యాపేట,ఆగస్టు 26 :** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వార కుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాల య్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

**హైదరాబాద్,ఆగస్టు 26 :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026–ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌ను పెట్టుబడులను ఆకర్షించేలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. హైదరాబా ద్‌లోని మహా త్మా జోతిబా పూలే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల, ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని భట్టి సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవాలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగా హన ఒప్పం దాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగిం చాలన్నారు. డిసెంబర్‌లో జరిగే సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్‌షో లు నిర్వహి ంచి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహిం చాలనీ, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను సయమపాలన ప్రకారం పూర్తి చేయాలని భట్టి స్పష్టం చేశారు.

# కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

(మొదటి పేజీ తరువాయి)

హై–పెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ లో ప్రపంచ ఉత్తమ విధానాలకు మధ్య ఒక వారధి అని ఆయన పేర్కొన్నారు. కెఎన్ఎస్ యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్ లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాలలో 16 పతకాలను అందించారు. అలాంటి శ్రేష్టమైన సంస్కృతిని తెలంగాణకు తీసుకురావాలని తాము కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అలాంటి కార్యక్రమాన్ని ముందుకు నడిపించి, మన యువ అథ్లెట్లు ప్రపంచ క్రీడా శ్రేష్టత నుంచి నేర్చుకునేందుకు కొత్త మార్గాలను తెరిచిన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి, క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులకు, స్పోర్ట్స్ యూనివర్సిటీకి అభినందనలు తెలిపారు. దీంతో మన గ్రామాలు, పట్టణాల నుండి ఒలింపిక్ పోడియం వరకు తెలంగాణ ఈ ప్రయాణానికి సిద్ధమవుతోందని చెప్పారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న తరుణంలో, తెలంగాణ సిద్ధంగా ఉండాలని నిశ్చయించుకుందని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లు.. ఫైనల్ బిల్లులను మేమే చెల్లిస్తాం: పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కేంద్ర మంత్రి వచ్చిన సందర్భంలో, రెండు వారాల క్రితం పార్లమెంట్ సభ్యులతో కలిసి తాను స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని మంత్రి పొంగులేటి తెలిపారు.

అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టాలని ఆయన ప్రశ్నించారు.

ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం జమ అవుతాయని ఆయన తెలిపారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా నిధులు చెల్లిస్తామన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# నోటీసుల నాటకం..

# కబ్జాదారులకు రెవెన్యూ అండ?

- సర్వే నంబర్ 329లో 283 గజాల ప్రభుత్వ స్థలంపై అక్రమ నిర్మాణాల ఆరోపణలు
- చర్యలు తీసుకోకుండా నోటీసులతో సరిపెడుతున్నారన్న విమర్శలు
- లక్షల రూపాయల అక్రమ వసూళ్లపై తీవ్ర ఆరోపణలు.. ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్








**కుత్బుల్లాపూర్: ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**

ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు కుత్బుల్లాపూర్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సర్వే నంబర్ 329లోని సుమారు 283 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ, కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? ప్రభుత్వ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో, నోటీసుల పేరుతో లక్షల రూపాయల అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న తీవ్రమైన ఆరోపణలు రెవెన్యూ అధికారులపై వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిన అధికారులు, ఆరోపణల ప్రకారం, చర్యలు తీసుకోకుండా కబ్జాదారులతో రహస్య ఒప్పందాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఓ మాజీ కార్పొరేటర్‌కు సంబంధించి ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సర్వే నంబర్ 329లోని 283 గజాల ప్రభుత్వ స్థలంపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమ నిర్మాణాలు ఉంటే వాటిని తొలగించాలని, అలాగే నోటీసుల పేరుతో అక్రమ వసూళ్ల ఆరోపణలపై కూడా స్వతంత్ర విచారణ నిర్వహించి నిజానిజాలు తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే నోటీసులతో సరిపెట్టడమేంటి? నోటీసుల తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే బాధ్యత ఎవరిది? లక్షల వసూళ్ల ఆరోపణల వెనుక అసలు నిజం ఏమిటి? కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులపై వినిపిస్తున్న ఈ ఆరోపణలకు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# తుర్కపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా పెండెం రవి ఏకగ్రీవ ఎన్నిక

**తుర్కపల్లి, ఆగస్టు 26**



తుర్కపల్లి మండల కేంద్రంలో బుధవారం నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తుర్కపల్లి మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన పెండెం రవి(వార్త రిపోర్టర్) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా ఆరే,నర్సింహులు(నవ తెలంగాణ)ఉపాధ్యక్షులుగా,అక్కారం కృష్ణ,కొండం నాగరాజు,ఆకుల శేఖర్,వర్కింగ్ ప్రెసిడెంట్ కొలనుపాక కొండల్(కనకరాజు-ప్రజాపక్షం)ప్రధాన కార్యదర్శి పులిగిల్ల స్వామి(ఆంధ్ర ప్రభ)కోశాధికారి ఎం.డి.చాంద్ పాషా,సహాయ కార్యదర్శులు గడిపె ఇంద్రయ్య,ఆకుల రాజుకుమార్.గౌరవ సలహాదారులు షేక్ బురాన్,ప్రచార కార్యదర్శి గా పుట్ట అంజనేయులు,సంయుక్త కార్యదర్శులుగా తునికి శ్రీనివాస్, కర్రె ఉపేందర్ గౌడ్,ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు పెండెం రవి మాట్లాడుతూ విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,మండల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు,అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఆదిమూలం సురేష్, జివిలికపల్లి మహేష్, బేతాల బాబు,ఆకుల నవీన్,పుట్ట కార్తీక్,కొత్తింటి సురేష్,సుంకి శివ లను ఎన్నుకున్నారు.

# కూతురు మృతిని జీర్ణించుకోలేక తండ్రి మృతి.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి మృతి.





**శామీర్పేట, ఆగస్టు 28 :** ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు... అలియాబాద్ మున్సిపాలిటీ లాల్గడి మలక్పేటకు చెందిన రాములు(50) మేస్త్రీ పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు.అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు మరణని జీర్ణించుకోలేక కొంతకాలం నుండి బాధపడుతూ చివరికి తనను తానే శిక్షించుకొని మృతి చెందరు రాములు. మృతి చెందిన వ్యక్తి కీ భర్య,ఇద్దరు కూతుర్లతో పాటు కుమారుడు ఉన్నాడు. బొమ్మరాశిపేట పరిధిలో ఉరి వేసుకుని వికతజీవిగా కనిపించగా స్థానికులు 112 నెంబర్కు కాల్ చేసి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు మృతికి కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

# మిలాద్ నబి బందోబస్తు ఏర్పాట్లపై

# సైబరాబాద్ సీపీ పరిశీలన







అదేవిధంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సైబరాబాద్







**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**

మిలాద్ నబీ సందర్భంగా నిర్వహించనున్న ఊరేగింపును దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జగద్గిరిగుట్ట, సూరారం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఊరేగింపు సాగే మార్గాన్ని పరిశీలించిన సీపీ.. రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ పోలీసు అధికారులతో సమావేశమై మిలాద్ నబీ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఊరేగింపు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

తదుపరి కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని సీసీఎస్, ఎస్ఓటీ కార్యాలయాలను సీపీ సందర్శించారు. ఆయా విభాగాల పనితీరు, భద్రతా అంశాలు, పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసులు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

అనంతరం గాజులరామారం ప్రాంతంలో సైబరాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు పనులను పరిశీలించారు. పెట్రోల్ బంకు ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితి, మౌలిక వసతులు, చేపట్టాల్సిన తదుపరి పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

పోలీస్ కార్ హెడ్‌క్వార్టర్స్ కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సీపీ పరిశీలించారు. స్థల పరిస్థితులను పరిశీలించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, కుత్బుల్లాపూర్ అదనపు డీసీపీ పురుషోత్తం, ఏసీపీ పబాల గంగిరెడ్డి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఏడవ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా

**- నాగబండి మధుసూదన్**



**ఆలేరు ఆగస్టు 26**

ఏడవ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మండలంలోని కొలనుపాక ఏడవ వార్డు సభ్యులు నాగ బండి మధుసూదన్ అన్నారు. రక్షాబంధన్ పురస్కరించుకొని ముందస్తుగా వార్డులోని మహిళలకు రాఖీలతో పాటు మిఠాయిలు పంపిణీ చేసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంకం సంపత్, పుల్లె రవి, సుధాకర్, చరణ్, నిర్మల, కవిత, శ్రీవాణి, బాలమణి, శారద, వల్లాల లక్ష్మి, బాధని విజయ, తదితరులు పాల్గొన్నారు.

# 13 రాజాపేట....సందిల భాస్కర్ గౌడ్ ను సత్కరిస్తున్న తుంగబాలు

**మదర్ డైరీ డైరెక్టర్ ను సత్కరించిన టిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు**

**రాజాపేట, ఆగస్టు 25**

రాజపేట మండల బి. ఆర్. ఎస్. పార్టీ సీనియర్ నాయకులు మధర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయనకు బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆరెస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా: తుంగ బాలు, పార్టీ మండల నాయకులు సత్కరించారు. మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, జలసాధన సమితి కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, ఉన్నారు.



గురువారం,
ఆగస్టు 27, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# పోలంపల్లిలో పెద్ద చెరువు మత్తడి వద్ద చెట్ల తొలగింపు



**చేగుంట ఆగస్టు 26**

చేగుంట మండలంలోని పొలంపల్లి గ్రామలో పెద్ద చెరువు మత్తడి పోచమ్మ వద్ద అలుగు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. గ్రామ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో భానుచందర్ సహకారంతో అలుగు వద్ద అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తన గ్రామ ప్రజలు, రైతుల భద్రత కోసమే చెరువులు, కుంటలను కాపాడాలని అన్నారు. చెరువులను ఆక్రమిస్తే, చెట్లను నరికితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామంలోని చెరువులు, కుంటలను నెలకు రెండుసార్లు అయినా ఇరిగేషన్ అధికారులు పరిశీలించాలని కోరారు.

# చేగుంటలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



**చేగుంట, ఆగస్టు 26**

చేగుంట మండల కేంద్రంలోపవిత్ర మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా చేగుంట పట్టణంలో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చేగుంట ఏఎంసీ డైరెక్టర్ మహమ్మద్ మొజామిల్ పాల్గొన్నారు. ఈ ర్యాలీతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ర్యాలీలో చిన్నారులు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, ప్రేమ, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రజలకు చాటుతూ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మహమ్మద్ సల్మాన్, మస్జీద్ సదర్ మహమ్మద్ షకీల్, నాయబ్ సదర్ మహమ్మద్ రహీముద్దీన్, కమిటీ సభ్యులు షేక్ గౌస్, మహమ్మద్ జలీల్, మహమ్మద్ ఆరిఫ్, మస్జీద్ ఇమామ్ అన్వర్ ఉల్ హాక్, అజీమ్, మొజామ్మిల్ పాల్గొన్నారు.

# స్మార్ట్ ఫోన్ సైబర్ సెక్యూరిటీపై పరిశోధనకు పీహెచ్.డీ.

**పటాన్‌చెరు, ఆగస్టు 26:**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి కోక విజయ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'స్మార్ట్ ఫోన్లలో ఇన్ స్టాలేషన్ అనంతర సైబర్ దాడులను గుర్తించి, వాటి ప్రభావాన్ని తగ్గించే అనుకూల వ్యవస్థ'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. కిరీట్ ముప్పవరం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, అప్లికేషన్ ఇన్ స్టాలేషన్ తరువాత తలెత్తే కొత్త ముప్పుల నుంచి ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ భద్రతను బలోపేతం చేయడంపై దృష్టి



సారిస్తుందని తెలియజేశారు. ఈ పరిశోధన, నకిలీ అప్లికేషన్లు, మ్యాన్-ఇన్-ది-డిస్క్ దాడులు, రీప్యాకేజింగ్, ప్రివిలేజ్ ఎస్కలేషన్, యూఐ స్పూఫింగ్ వంటి ముప్పులను నిజ సమయంలో గుర్తించడానికి, ప్రవర్తనా పర్యవేక్షణ, మెషిల్ లెర్నింగ్, రిస్క్-ఆధారిత ప్రతిస్పందన యంత్రాంగాలను మిళితం చేసే ఒక అనుకూల భద్రతా ఫ్రేమ్ వర్కును అభివృద్ధి చేసిందన్నారు. ప్రతిపాదిత పద్ధతులు నకిలీ-యాప్ గుర్తింపులో 95.83 శాతం ఖచ్చితత్వాన్ని, దాడి గుర్తింపులో 97.33 శాతం ఖచ్చితత్వాన్ని సాధించగా, డైనమిక్ సెక్యూరిటీ అసెస్ మెంట్ ఫ్రేమ్ వర్కు 94.7 శాతం గుర్తింపు ఖచ్చితత్వాన్ని నమోదు చేసి, ఇన్ స్టాలేషన్ తరువాత జరిగే విజయవంతమైన దాడులను గణనీయంగా తగ్గించినట్టు వివరించారు. ఈ పరిశోధనను బెంచ్ మార్క్ డేటాసెట్లను ఉపయోగించి ధృవీకరించారని, ఇది కనిష్ట వనరుల వినియోగంతో మెరుగైన దాడి నివారణను ప్రదర్శించి, వనరుల కొరత ఉన్న స్మార్ట్ ఫోన్లలో ఆచరణాత్మక వినియోగానికి దాని సామర్థ్యాన్ని ప్రస్ఫుటీకరిస్తోందన్నారు. డాక్టర్ విజయ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సోమయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాల జోరు..

## టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర ఆరోపణలు





**కుత్బుల్లాపూర్ ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**

చింతల్ సర్కిల్ 54 పరిధిలోని జగద్గిరిగుట్ట సోమయ్య నగర్‌లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘిస్తూ అంతస్తులపై అంతస్తులు నిర్మిస్తున్నా, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ, చింతల్ సర్కిల్ 54 పరిధిలో మాత్రం అవి అమలు కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై చర్యలకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తుంటే, వాటిని అమలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా యి. సోమయ్య నగర్‌లో అనుమతుల్లేని నిర్మాణాలపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం అధికారులకు తెలియదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో, కొన్ని అక్రమ నిర్మాణాల విషయంలో అంతస్తులకు లక్షల రూపాయల చొప్పున ముడుపులు వసూలవుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు సంబంధం ఉందా? లేకపోతే అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, సోమయ్య నగర్‌లో జరుగుతున్న నిర్మాణాలకు అనుమ తులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించాలని స్థానికు లు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగినట్లు తేలితే సంబంధిత భవనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు, ముడుపుల ఆరోపణలపై కూడా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చింతల్ సర్కిల్ 54 లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్న అక్రమ నిర్మాణాలపై అధికారులు, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# డ్రైనేజీ నీరుతో నరకయాతన.

**-మున్సిపల్ అధికారులు స్పందించాలి..**
**-పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్..**





**కుత్బుల్లాపూర్: ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**

(సిఎంసి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, అధికారులు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సూరారం మెయిన్ రోడ్ లో బస్ స్టాప్ వద్ద డ్రైనేజీ నీరు పొంగడం వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు వాహనదారులకు, నరకయాతనగా మారిందని, ట్రాఫిక్ పోలీసులకు సైతం, తీరని బాధగా మిగులుతుందని వాపోయారు. ఈరోడ్డు వెంట ఆరు నెలల నుండి వేసే పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రక్కన ఉన్న పాత డ్రైనేజీ లైన్ డ్యామేజ్ అవ్వడంతో ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. గత ఏడాది కూడా రోడ్డు ఇటుపక్క నర్సాపూర్ నుండి బాలానగర్ వెళ్లే రోడ్ నందు వర్షపు నీరు, కాలువ నిర్మాణంలో నెలల తరబడి నిలువున్నాయని, ప్రజలు తిరగబడడంతో, పై అధికారుల ఒత్తిడితో పని పూర్తి చేసినారని, తెలిపారు. రోడ్డు డ్రైనేజీ కారణంగా ప్రతిరోజు,ఉదయం, సాయంత్రం, కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుందని, ట్రాఫిక్ పోలీసులకు తలకు మించిన భారమవుతుందన్నారు. కావున అధికారులు తక్షణమే పరిశీ లించి, ఈ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకు ండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# మిలాద్ ఉన్ నబీ ఊరేగింపును పర్యవేక్షించిన ఏసీపీ చక్రపాణి

**భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పోలీసులకు సూచనలు**





**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఊరేగింపును జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఊరేగింపు సాగే మార్గంలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ.. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఊరేగింపు సజావుగా కొనసాగేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఊరేగింపు మార్గంలో రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ప్రశాంత వాతావరణంలో పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

# అధికారుల మౌనం..

# అక్రమ నిర్మాణదారుల ధీమా!

**మహంకాళి నగర్‌లో అనుమతులు లేకుండా G+5, పెంట్‌హౌస్ నిర్మాణాలు? పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు**





**కూకట్ పల్లి : ప్రతినిధి శ్రవణ్ కుమార్, ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**
ఆల్విన్ కాలనీ సర్కిల్--51 పరిధిలోని షంషీగూడ మహంకాళి నగర్‌లో అనుమతులు లేకుండా భారీ నిర్మాణాలు కొనసాగు తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 80 గజాల స్థలంలో +౦5తో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేపడుతు న్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నా అధికారులు కనీసం తనిఖీలు నిర్వహిం చకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబం ధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**'అధికారులను మేనేజ్ చేశాం' అంటూ నిర్మాణదారుల ధీమా?**
స్థానికుల ఆరోపణల ప్రకారం.. అక్రమ నిర్మాణదారులు మాత్రం తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, సంబంధిత అధికారులను 'మేనేజ్ చేశామని' బహిరంగంగానే చెబుతున్నట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు నిజమైతే అధికార యంత్రాంగంలో అక్రమ నిర్మాణాలకు అండదండలు అందుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలను అధికారులు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. సంబంధిత నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? అనుమతులు ఉంటే నిర్మాణం వాటికి అనుగుణంగానే జరుగుతోందా? అనే అంశాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.



**శేరిలింగంపల్లి ఘటన తర్వాత కూడా అదే నిర్లక్ష్యమా?**
ఇటీవల శేరిలింగంపల్లి ప్రాంతంలో భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో అక్రమ, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ మహంకాళి నగర్‌లో నిర్మాణాలు కొనసాగుతున్నా యనే ఆరోపణలు రావడం అధికారుల పనితీరుపై విమర్శలకు దారితీస్తోంది. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లోనూ అది ,కారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కమిషనర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా?**
అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోతే సంబంధిత అధికారులపై ఉన్నతా ధికారులు విచారణ జరిపి బాధ్యత నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు. షంషీగూడ,మహంకాళి నగర్‌లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి, అనుమతులు లేకపోతే వెంటనే పనులను నిలిపివేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మిలాద్ ఉన్ నబీ ఊరేగింపులో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సుమతి

**క్షేత్రస్థాయిలో బందోబస్తును పర్యవేక్షించిన మల్కాజిగిరి కమిషనర్**







**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**
మిలాద్ ఉన్ నబీ సందర్భంగా హస్మత్‌పేట్, అల్వాల్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఊరేగింపును మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఊరేగింపు మార్గంలో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందితో కమిషనర్ సుమతి మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఊరేగింపు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమ న్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఊరేగింపు సందర్భంగా ట్రా ఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఏదై నా సమస్య తలెత్తితే వెంటనే స్పందించాలని పోలీసు అధికారులకు సూచించారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంత వాతావ రణంలోజరిగేలామల్కాజిగిరి పోలీస్‌కమిషనరేట్‌పరిధిలో పటిష్టమైన భద్రతా చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## మన బూత్‌లో మన ఓట్లను కాపాడుకుందాం: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**- గోదావరిఖనిలో సర్ ఫేజ్-2పై శిక్షణ కార్యక్రమం**



**గోదావరిఖని, 25 ఆగస్టు (:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ సర్ ఫేజ్-2 ప్రక్రియలో భాగంగా బుధవారం గోదావరిఖనిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, దీపక్ రాథోడ్, ప్రభాకర్ రెడ్డి, ఫహీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... సర్ ఫేజ్-2 ప్రక్రియను అధికారులు, బూత్ స్థాయి సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా చూడాలని, అనర్హులు లేదా మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్ ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా సహకరిం చాలని కోరారు. "మన బూత్‌లో మన ఓట్లను కాపాడుకుందాం" అని పిలుపునిచ్చారు. దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ... సర్ ఫేజ్-2 శిక్షణలో అందిస్తున్న మార్గదర్శకాలను సిబ్బంది పూర్తిగా అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జామే మస్జీద్ లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాం



**పెబ్బేరు ఆగస్టు 26) :** మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జామే మస్జీద్ లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ అక్కిశ్రీనివాస్ గౌడ్, స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రవక్త బోధనలు శాంతి సామరస్యానికి ప్రతీకని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంచుతాయని అన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, పండుగలను సేవా కార్యక్రమాల తో జరుపుకోవడం వల్ల సమాజానికి మంచి సందేశం వెళుతుందని, యువత స్ఫూర్తిగా నిలవాలని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 50 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మూడో వార్డు కౌన్సిలర్ హరిశంకర్ నాయుడు, మాజీ కో ఆప్షన్ ఎండి ముస్తాక్, మైనార్టీ నాయకులు, మస్జీద్ కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముందు ధర్నాలో పాల్గొనాలని టీఎస్ యూటీఎఫ్ పిలుపు



**పెబ్బేరు ఆగస్టు 26:** రెండు పీఆర్సీ6 పెండింగ్ డీఎలు, పాత పెన్షన్ పునరుద్ధరణ డిమాండ్లతో ఈనెల 27న కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 40% ఫిట్మెంట్ తో పీఆర్సీ ప్రకటించాలని, జీవో 25ను సవరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో మహాధర్నా ఉంటుందని ఆయన అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఐక్య పోరాటాల ద్వారానే డిమాండ్లు సాధించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## కపటి గ్రామ యువతకు బీజేపీ నేత ఉషా రాజు పిలుపు
## -- ఓటు నమోదుకు ప్రోత్సాహం



**కపటి, 26 ఆగషు:** కపటి గ్రామంలో బీజేపీ నేత ఉషా రాజు యువతను ఉద్దేశించి కీలక పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "యువ ఓటు -- యువ నాయకత్వం... గ్రామ అభివృద్ధికి బలమైన అడుగు" అని అభిప్రాయపడ్డారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, గ్రామ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను గుర్తెరిగి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యువత చురుకుగా భాగస్వామ్యం వహించినప్పుడే గ్రామాభివృద్ధి, నాయకత్వ మార్పు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు.

## సేవా మూర్తి మదర్ థెరిస్సా

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం, ఆగస్టు 26,
సేవా మూర్తి మదర్ థెరిస్సా గారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా మంత్రి క్యాంప్ కార్యాలయం నందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం గాని దేశం వచ్చి కలకత్తా వంటి మహానగరంలో కష్టంలో ఉన్న అనేకమంది అభాగ్యులకు అనేక రకాల సేవలు అందజేసిన మాతృమూర్తి మదర్ థెరిస్సా అన్నారు. కలకత్తాలో మిషన్ ఆఫ్ చారిటీ స్థాపించి నిస్సహాయులు, అనాధలతోపాటు, కుష్టు రోగులకు సైతం సేవలు అందజేసిన గొప్ప మనసున్న మంచి మనిషి, సేవకురాలు మదర్ తెరిసా అన్నారు. మదర్ థెరిస్సానిస్వార్ధంగా చేసిన సేవలకు ఇండియాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ, భారతరత్న, నోబెల్ శాంతి బహుమతి వంటి ఎన్నో అవార్డులు పొందడం జరిగిందన్నారు. ఇతరులకు సహాయం చేయడం మదర్ థెరిస్సా నుండి నేర్చుకోవాలనే నానుడి ఏర్పడే అంతలా ఆమె చేసిన సేవలను తెలియపరుస్తుందన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం లో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం, ఆగస్టు 26
నియోజకవర్గంలోని గంట్యాడ మండలం నరవ గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం నరవ గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోలమాంబ అమ్మవారి సేవలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం ఆగస్టు 26



నియోజకవర్గంలోని గంట్యాడ మండలం వసంత గ్రామం గ్రామదేవత పోలమాంబ అమ్మవారి సేవలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం గ్రామంలో జరుగుతున్న పోలమాంబ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి దాన్యం నైవేద్యం సమర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు తప్పెటగుళ్ళు వాయిద్యాలతో టపాసులు పేలుస్తూ ఘనస్వాగతం పలికి, ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కోల మాంబ అమ్మవారి ఆశీస్సులు, కృపాకటాక్షములు నియోజకవర్గ ప్రజలపై పుష్కలంగా ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# లక్షలు తీసుకొని.. లక్షణంగా ఉన్నారు.

- కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు..!
- అక్రమ షెడ్ పై చర్యలు ఎక్కడ..?








కుత్బుల్లాపూర్ : ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)
గాజులరామారం సర్కిల్ 57 మహాదేవపురం ప్రాంతంలో అక్రమ షెడ్డు నిర్మాణం జరుగుతుండగా.. అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం వెనక లక్షలు ముట్టాయి అనే ఆరోపణలు ప్రజలలో ఉంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా అక్రమ షెడ్డు నిర్మాణం జరుగుతుంటే అధికారులు మాత్రం అటు వైపు కూడా తొంగి చూడకపోవడమే ఇందుకు నిదర్శనంగా స్థానికులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఒకవైపు ట్రాఫిక్, మరోవైపు మౌలిక సదుపాయాలలో ఇబ్బందులు కలిగించే విధంగా అక్రమ షెడ్లు నిర్మాణం జరుగుతుంటే... అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక ముడుపులు ముట్టాయి అనే ఆరోపణలు వెలుబడుతున్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలు అక్రమ షెడ్లను, పర్యవేక్షించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవలసిన అధికారులు మాత్రం తమకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తూ... కేవలం అక్రమ సంపాదనకు మాత్రమే వారి సమయాన్ని వెచ్చిస్తూ. ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకుంటున్న జీతానికి జవాబుతనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు . గత కొంతకాలంగా సర్కిల్ 57 పరిధిలో ఇదే తంతు కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ ఉన్నతాధికారులు మాత్రం కిందిస్థాయి సిబ్బందిపై దృష్టి పెట్టకపోవడం విచారకరమని స్థానికులు భావిస్తున్నారు. అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ తమకు ఎస్ఐఆర్ , మరో అధికారిక కార్యక్రమాల పేరుతో కాలయాపన చేస్తూ వారికి ఇచ్చిన విధులు చేయడం లేదని ప్రజల విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బాధ్యత కలిగిన మున్సిపల్ అధికారులు తక్షణమే ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణాన్ని నిలిపివేసి అధికారులు వారిపై ఉన్న విశ్వసనీయతను పెంచుకోవాలని స్థానిక ప్రజలు గుర్తు చేస్తున్నారు

# మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ప్రశాంతంగా ముగింపు

- భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఏసీపీలు







మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)
మిలాద్ ఉన్ నబీ సందర్భంగా తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఊరేగింపును మల్కాజిగిరి ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, గోపాలపురం ట్రాఫిక్ ఏసీపీ పి. సుబ్బయ్య పర్యవేక్షించారు. ఊరేగింపు సాగే మార్గంలో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు.. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఊరేగింపు సజావుగా కొనసాగేలా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఊరేగింపు సందర్భంగా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# ప్రజలతో మమేకమై.. నేరాల నివారణే లక్ష్యంగా పోలీసింగ్

- మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం









మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)
మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలతో పాటు 'మీ సురక్ష', 'నేను సైతం 2.0' కార్యక్రమాలను చేపట్టారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానికులతో మమేకమై భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా చర్యలు చేపట్టారు. వాహనాల తనిఖీల ద్వారా రహదారి భద్రతను పర్యవేక్షిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెట్టి నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించకుండా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. 'మీ సురక్ష', 'నేను సైతం 2.0' కార్యక్రమాల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో నేరాల నివారణ, ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ప్రజల సహకారంతో సురక్షితమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కేటీపీపీ ఆర్టిజన్ కార్మికుడు అంకం చిరంజీవి అంత్యక్రియల్లో పాల్గొన్న 64 ఎ ఐ టి యు సి హెచ్ నాయకత్వం

**చెల్పూర్ ప్రతినిధి ఆగస్ట్ 26 (పీపుల్స్ న్యూస్)**
కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ) స్టేజ్-1 బాయిలర్ షిఫ్ట్ నందు ఆర్టిజన్ గ్రేడ్-×× కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కీ.శే. కామ్రేడ్ అంకం చిరంజీవి మంగళవారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు.చిరంజీవి గారి భౌతికకాయాన్ని వారి స్వగృహం ఘణపురం నందు ఎ ఐ టి యు సి హెచ్ 64 నాయకత్వం సందర్శించి ఘనంగా నివాళులర్పించింది. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో నాయకులు, కార్మికులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఎ ఐ టి యు సి నాయకులు మాట్లాడుతూ, చిరంజీవి మృతి కేటీపీపీ కార్మిక కుటుంబానికి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



కార్మికుడిగా తన విధులను నిబద్ధతతో నిర్వహించిన చిరంజీవి సేవలను వారు స్మరించుకున్నారు. ఆయన కుటుంబానికి ఎ ఐ టి యు సి హెచ్ 64 ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.అనుకోని విధంగా చిరంజీవి మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి హెచ్ -64 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, రీజినల్ ప్రెసిడెంట్ కోల శ్యామ్, ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, రీజినల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పుల రవి, సంయుక్త కార్యదర్శి పెరుక రాజేష్, కలువల సతీష్, బానోత్ బాలాజీ, కత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు భూక్య జంపన్న భరోసా.

**- శంకరాజుపల్లిలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు శ్రీకారం**





**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 26( పీపుల్స్ న్యూస్)**
గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న సూచన మేరకు ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు నెలలపాటు ఈ శిక్షణ కొనసాగనుంది.
భూక్య జంపన్న చొరవతో గ్రామీణ యువతకు కంప్యూటర్ విద్యను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తోంది. జాడి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం, డిజిటల్ సేవలపై శిక్షణ ఇస్తున్నారు.
ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉద్యోగ సాధనకు ఎంతో కీలకమని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక విద్య అందక అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు భూక్య జంపన్న చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని యువత తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# రామచంద్రపూర్‌లో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు

**- పాల్గొన్న మంత్రి సీతక్క**











**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 26( పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలో బంజారా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సోదర సోదరీమణులతో మంత్రి సీతక్క ఆత్మీయంగా ముచ్చటించి, తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రత్యేకమైన గుర్తింపును కలిగి ఉందని, తరతరాలుగా వస్తున్న ఆచారా లు, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. బంజారా సమాజం ఎదుర్కొంటు న్న సమస్యలు, స్థానికంగా అవసరమైన అభివృద్ధి అంశాలను సంఘం నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంఘం నాయకులు సమర్పించిన వినతులపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బంజారా సమాజ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా తీజ్ వేడుకల్లో బంజారా మహిళలు, యువత, సంఘం నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు, సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, చైర్మన్ బొక్కా సత్తి రెడ్డి, ఆత్మ కమిటీ ములుగు చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బంజారా సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మదర్ థెరిసా 116వ జయంతి వేడుకలు

**- మహిళా సమానత్వ దినోత్సవ శుభాకాంక్షలు**





**రామగుండం ఎన్టీపీసీ,ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**
మహిళా సమానత్వ దినోత్సవం, సేవామూర్తి భారతరత్న, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మదర్ థెరిసా 116వ జయంతి వేడుకలను ఎన్టీపీసీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త దాసరి స్వప్న మహేష్ మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ ఆవరణలో మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని మామిడి మొక్కను నాటారు.ఈ సందర్భంగా దాసరి స్వప్న మహేష్ మాట్లాడుతూ.. మదర్ థెరిసా సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని స్వార్థాన్ని వీడి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు తమకు తోచిన సహాయం అందించాలని కోరారు. నిస్సహాయులు, నిరాశ్రయులు, నిరుపేదలు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, దివ్యాంగులకు మదర్ థెరిసా అందించిన సేవలను కొనియాడారు.విదేశీయురాలైనప్పటికీ భారత పౌరసత్వం పొంది సుదీర్ఘకాలం దేశంలో సేవలందించిన ఆమె విశ్వ సేవామూర్తిగా నిలిచారని పేర్కొన్నారు.అనంతరం మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థానాల్లో ఉన్నప్పటికీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించాలని సూచించారు. కుటుంబంలో తల్లిదండ్రులు, గురువులు, భర్త, పిల్లలను గౌరవిస్తూ కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కోరారు.కార్యక్రమంలో ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జై భీమ్ నగర్ కమిటీ హాల్ నిర్మాణంకు 20000వేల ఆర్థిక సహాయం అందచేసిన బిఆర్ ఎస్ యువ నాయకులు కట్ట సుందర్ బాబు,



**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 26( పీపుల్స్ న్యూస్)**
జై బీమ్ నగర్ కమిటీ హాల్ నిర్మాణం కొరకు బి ఆర్ ఎస్ రాష్ట్ర యువనాయకులు కట్ట సుందర్ ను అధ్యక్షులు భాస్కర్ మరియు కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కట్ట సుందర్ జై భీమ్ నగర్ లో నిర్మాణంలో ఉన్న కమిటీ హాల్ పనులను పర్యవేక్షించి కమిటీ హాల్ నిర్మాణం కొరకు 20,000 ఇరవై వేల రూపాయలు నగదును కమిటీ సభ్యులకు అందజేసారు , కాలనీల అభివృద్ధి కోసం తన వంతు సహాయసహకారాలు ఎల్లపుడు ఉంటాయని తెలియజేయడం జరిగింది.

# మంచినీటి సరఫరా, సివరేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

**- అధికారులకు పద్మారావు గౌడ్ ఆదేశాలు**



**సికింద్రాబాద్: ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**
సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సివరేజీ సమస్యలను పూర్తిగా నివారించాలని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు.బుధవారం మోండా మార్కెట్‌లోని తన నివాసంలో జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ నేతృత్వంలోని అధికారులతో పద్మారావు గౌడ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ లైన్లు పొంగిప్రవహిస్తున్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు.ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా మధురానగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచినీటి సరఫరా, సివరేజీ వ్యవస్థలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందిస్తున్నామని జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ తెలిపారు.ఈ సమావేశంలో జలమండలి మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ వేడుకలు





**నర్వ ఆగస్టు 26**

మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ బుధవారం రోజున ఘనంగా జరుపుకున్న మైనార్టీ నాయకులు సర్వ మానవాళి శ్రేయస్సుకోసం శాంతిని నెలకొల్పేందుకు కృషిచేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవర్త సాటివారి పట్ల ప్రేమ దయ కలిగి ఉంటూ శాంతియుత సమాజాన్ని నెలకొల్పడానికి జీవితకాలం కృషిచేసిన ప్రవర్త జన్మదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్న నర్వ జామ మజీద్ కమిటీ తరపున కమిటీ మండల అధ్యక్షుడు సాహెబ్ హుస్సేన్ సలీం సాబ్ ఖలీల్ అహ్మద్ ఆటో రఫీ రిపోర్టర్ కాజా పటేల్ మౌలాలి ఇక్బాల్ రాయికోడ్ జబ్బర్ మౌలాన్ సాబ్ మండల పరిధిలోని రాయికోడ్ సిపూర్ కల్వాల్ లంకాల్ పెద్దకడుమూర్ గ్రామస్తులందరూ మండల కేంద్రంలో మిలాద్ ఉల్ నబీ వేడుకలను పురవీధుల్లో భారీ ర్యాలీగా పాల్గొన్న మైనార్టీ నాయకులు యువ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి





**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 26( పీపుల్స్ న్యూస్)**

మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను బుధవారం రిటైర్డ్ ఐ సి ఎం ఆర్ సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జిఎస్ జి అయ్యంగార్ ఐఏఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. . ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కాకతీయుల శిల్పకళకు తలమానికం రామప్ప దేవాలయమని అన్నారు. అనంతరం రామప్ప చెరువు సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలిసులు శ్రీనివాస్, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు

# ఐపీఎస్ హోదా పొందిన డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు సన్మానం...!



**జనగామ, ఆగస్టు 26 :** ఐపీఎస్ హోదా పొందిన జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను... డీసీసీ అధ్యక్షురాలు, వైటీడీఏ సభ్యులు ధన్వంతి లక్ష్మీ నారాయణ నాయక్ దంపతులు, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి కలిసి... శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించి... శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

# పి ఆర్ సి అమలు చేయాలి, డిఎలు ఇవ్వాలి, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ లతో...!!

**జిల్లా కేంద్రం లో TGEJAC ధర్నా ను జయప్రదం చేయండి:TGEJAC జనగామ జిల్లా...!!**

**జనగామ, ఆగస్టు 26 ) :** దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ... నేడు బుధవారం రోజున ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని చౌరస్తా వద్ద అమలు చేయాలని, 6 డిఏ లు ప్రకటించాలి, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, జూరా విధానం రద్దు చేయాలని తదితర డిమాండ్ ల సాధన కోసం TGEJAC ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించడం జరుగుతుందని, జయప్రదం చేయాలని కోరుతూ... TGEJAC జిల్లా కమిటీ సమావేశం నిర్వహించిన సందర్భంగా చైర్మెన్ ఖాజా షరీఫ్, సెక్రటరీ కొర్నేలియస్ కోరారు.

ఈ సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు మిత్రులంతా తప్పకుండా సమయానికి హాజరై ధర్నా లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, మన హక్కులకోసం సంఘటితంగా 205 సంఘాల భాగస్వామ్యం తో ఈ పోరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ,వెంటనే పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకుంటే సెప్టెంబర్ 10 వ తేదీన రాష్ట్ర రాజధానిలో ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా నిర్వహించనున్నామని సమస్యలు మనందరివి కాబట్టి పోరాటంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భాగస్వామ్య సంఘాల బాధ్యులు చంద్రశేఖర్ రావు, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, అంబటి రాజయ్య, మహేందర్ రెడ్డి, సిద్ధి మల్లయ్య, ప్రభాకర్, హఫీజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు.

**మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించిన మైనాంపల్లి.**



**ఆల్వాల్,(ఆగస్ట్ 26) :-** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోని ఆర్టీసీ కాలనీలో జయ గార్డెన్స్ లో బోయిన్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ తండ్రి దశదిన కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతు రావు పాల్గొని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ తండ్రి చిత్రపటానికి పూలుమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ ఆనంద్ కుటుంబానికి ఎల్లప్పుడు నేను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని అప్రోచ్ రోడ్డుగా వినియోగించారన్న ఆరోపణలు

**●ఆకృతి కన్స్ట్రక్షన్‌పై పోలీస్ కేసు నమోదు**

**●సర్వే నంబర్ 454లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై రెవెన్యూ ఫిర్యాదు.. క్రైమ్ చీశీ.777/2026గా ఎఫ్ ఐ ఆర్**



IN THE COURT OF HON"BLE PJCJ CUM XI ADDL. METROPALITAN MAGISTRATE, KUKATPALLY, CYBERABAD. Honored Sir, Today i.e. On 24.08.2026 at 1600 hours, received a petition from G.V. Malleswara Rao, Mandal Girdawar, Bachupally Mandal,Cell.no.9963668599. In which read as follows. The brief facts of the case are that the complainant that Sy.No.454 of Bachupally Village is classified as Government land as per the Revenue Records. As per the Pahani for the year 2015-16, Sy.No.454 comprises Sy.No.454/1 to an extent of Ac.1.30 Gts and Sy.No.454/2 to an extent of Ac.0.02 Gts, totaling Ac.1.32 Gts, classified as Sarkari Poramboke, with the Pattadar and Possessor recorded as Sarkari.During field verification, it was noticed that Akruthi Constructions and Builders are unauthorizedly using approximately 64 Sq. Yds. of Government land in Sy.No.454 as an approach road, without any lawful right or permission.Therefore, he request you to register an FIR against Akruthi Constructions and Builders under the appropriate provisions of law, conduct a detailed investigation and take necessary legal action for the unauthorized trespass and use of Government land. Hence the FIR. (Original petition enclosed here with) Sd/- Station House Officer, PS Bachupally, Cyb

13. Action taken:

Since The above information reveals commission of offence(s) U/s as mentioned at item No:

1) Registered the case and took up the investigation or — Name E S SREEDHAR

2) Directed to take up the Investigation or — Rank: SI No. --

3) Refused investigation due to

4) Transferred to P.S ........ District ........ on point of jurisdiction.

F.I.R. read over to the complainant / informant, admitted to be correctly recorded and a copy given to the complainant /informant, free of cost. R.O.A.C

14. Signature / Thumb impression of the complainant / informant. — Signature of Officer in charge, Police Station — Name PANCHADA DALI NAIDU — Rank Inspector No --

15. Date and time of dispatch to the court:

Signature Not Verified

Dt: [illegible].08.2026

To
Station House Officer
Bachupally Police Station

Sub:- Govt. Land - Medchal-Malkajgiri District - Bachupally Mandal- Bachupally Village Sy No.454 - Illegal Tresspass in Govt Land-Request to book criminal case – Reg.

&&&

I G.V. Malleshwar Rao working as Revenue Inspector Bachupally Mandal, it is informed that Sy No.454 of Bachupally Village Bachupally Mandal is classified as Govt. land.

Further, as per the Revenue Record for the Pahani year 2015-16 of Bachupally Village the Sy No.454 to an extent Ac 01.32 gts is classified as follows.

| Sl No. | Village | Sy No | Extent | Classification | Name of the Pattadar | Name of the Possesor |
|---|---|---|---|---|---|---|
| 01 | Bachupally | 454/1 | (Ac 01-30gts) | Sarkari | Porampogu | Sarkari |
| 02 | Bachupally | 454/2 | (Ac 00.02gts) | Sarkari | Porampogu | Sarkari |

In this regard it is noticed that, the Akruthi Constructions and Builders are using approached road to an extent of 64 Sq yds in Sy No.454 of Bachupally Village of Bachupally Mandal .

Hence, it is requested to take action against Akruthi Constructions and Builders and requested to book FIR against him.



బాచుపల్లి పరిధిలోని సర్వే నంబర్ 454లో ఉన్న ప్రభుత్వ భూమిని అప్రోచ్ రోడ్డుగా వినియోగించారన్న ఆరోపణలపై ఆకృతి కన్స్ట్రక్షన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ భూమి వినియోగంపై రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 24న బాచుపల్లి పోలీసులు క్రైమ్ చీశీ.777/2026గా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసినట్లు వెల్లడైంది.సర్వే నంబర్ 454లో ప్రభుత్వానికి చెందిన భూమిని రహదారి కోసం వినియోగించిన వ్యవహారంపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో పోలీస్ కేసు నమోదు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతులతో అప్రోచ్ రోడ్డుగా వినియోగిoచారు? ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు ఏమి చెబుతున్నాయి? రోడ్డు నిర్మాణం లేదా వినియోగానికి సంబంధించి సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది.ఈ వ్యవహారంపై స్పందించిన ఆకుల సతీష్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని ఆక్రమించి అప్రోచ్ రోడ్డుగా వినియోగిస్తున్న అంశంపై తాము చేసిన పోరాటానికి పోలీస్ కేసు నమోదు కావడం నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రశ్నించిన వారిపై గతంలో కేసులు నమోదు చేసిన ఘటనలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత కేసు నమోదు ఆ వ్యవహారంపై మరో కోణాన్ని వెలుగులోకి తెచ్చిందని పేర్కొన్నారు.

సర్వే నంబర్ 454లోని మొత్తం ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. భూమి హద్దులను స్పష్టంగా గుర్తించి, ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు ఉన్నట్లు తేలితే వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు.అదేవిధంగా అప్రోచ్ రోడ్డుకు సంబంధించి తీసుకున్న అనుమతులు, రహదారి నిర్మాణానికి సంబంధించిన పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు, సంబంధిత శాఖల క్లియరెన్స్‌లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు ప్రయోజనాలకు వినియోగించినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే నంబర్ 454కు సంబంధించి రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ భూమి విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఏ మేరకు వినియోగంలో ఉంది? ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయి? అప్రోచ్ రోడ్డుగా వినియోగిస్తున్న భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఏ విధంగా నమోదై ఉంది? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత రెవెన్యూ శాఖపై ఉన్న నేపథ్యంలో సర్వే, హద్దుల నిర్ధారణ, ఆక్రమణల గుర్తింపు, స్వాధీనం వంటి చర్యలను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ వినిపిస్తోంది.

ఇప్పటికే ఎఫ్ ఐ ఆర్ నమోదు కావడంతో పోలీసుల దర్యాప్తులో ఏ అంశాలు వెలుగులోకి వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. రెవెన్యూ శాఖ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు సంబంధిత భూమి రికార్డులు, అనుమతులు, నిర్మాణ పత్రాలు, రహదారి వినియోగానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించే అవకాశం ఉంది.కాగా, ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో పూర్తిగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థ/సంబంధిత వ్యక్తుల వాదన కూడా దర్యాప్తు అనంతరం స్పష్టతకు రావాల్సి ఉంది. సర్వే నంబర్ 454 భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

# వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

**హైదరాబాద్ : ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మిగిలిపోయిన 61 సంవత్సరాల వీఆర్ఏల 3,797 మంది వారసులకు ఉద్యోగాలు కల్పించాలని, తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ వారసుల జేఏసీ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధి శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావును, మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు.గత ప్రభుత్వం 81, 85 జీవోలు జారీ చేసి మూడు సంవత్సరాలు గడిచినా, నేటికీ వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించేలా చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావును కోరారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు స్పందిస్తూ.. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్ఏల వారసుల సమస్యను సభ దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. అవసరమైతే జేఏసీ చేపట్టే ధర్నా కార్యక్రమాలకు హాజరవుతానని, వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, హరీశ్, సంగమేశ్వర్, భరత్, రవిసాగర్, యాదవ్, మహేష్ పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్ చోరీలతో బ్యాంక్ ఖాతాలు ఖాళీ!

- సరికొత్త 'హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్'పై అప్రమత్తంగా ఉండాలి
- ఫోన్ చోరీ.. పాస్‌వర్డ్ తస్కరణ.. బ్యాంక్ ఖాతాల నుంచి నగదు బదిలీ
- ప్రజలకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరిక



సెల్‌ఫోన్ చోరీని కేవలం ఫోన్ పోయిన ఘటనగా భావిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంప్రదాయ జేబుదొంగతనాలకు సైబర్ నేరాలను జోడించి, మొబైల్ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలను దోచుకుని బాధితుల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్న సరికొత్త 'హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్' ముఠాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం నిర్వహించిన దర్యాప్తులో ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**ముందుగా టార్గెట్.. ఆ తర్వాత ఫోన్ చోరీ**

ఈ ముఠాలు రద్దీ ప్రాంతాలను తమ నేరాలకు వేదికగా ఎంచుకుంటున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో స్మార్ట్‌ఫోన్లు వినియోగించే వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న వ్యక్తులను ముందుగా గుర్తిస్తారు.బాధితులు ఫోన్‌ను ఉపయోగిస్తున్న సమయంలో వారి స్క్రీన్ లాక్‌ను నిశితంగా గమనిస్తారు. ముఖ్యంగా ౡఘవతీఅ, ౢ×చీ, ౢఝంంషశీతీస ఎలా నమోదు చేస్తున్నారో వెనుక నుంచి పరిశీలిస్తారు. పాస్‌వర్డ్ తెలుసుకున్న తర్వాత అదును చూసి ఫోన్‌ను జేబు లేదా బ్యాగ్ నుంచి చోరీ చేస్తారు.

**ఫోన్ లాక్ ఉంటే 'సోషల్ ఇంజనీరింగ్'**

చోరీ చేసిన ఫోన్‌కు స్క్రీన్ లాక్ ఉండి పాస్‌వర్డ్ తెలియని సందర్భంలో నిందితులు మరో ఎత్తుగడకు పాల్పడుతున్నారు. బాధితుడు తన ఫోన్‌కు కాల్ చేసినప్పుడు ఫోన్‌ను లిఫ్ట్ చేసి తాము బస్సు కండక్టర్ లేదా డ్రైవర్ అని పరిచయం చేసుకుంటారు."మీ ఫోన్ బస్సులో దొరికింది.. వచ్చే స్టాప్‌లో ఇస్తాం" అంటూ నమ్మిస్తారు. అనంతరం ఫోన్ వివరాలు సరిచూసుకోవాలనే పేరుతో బాధితుడి నుంచే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్‌ను రాబట్టే ప్రయత్నం చేస్తారు.మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని, మరొక వ్యక్తి కూడా ఆ ఫోన్ తనదేనంటూ క్లెయిమ్ చేస్తున్నాడని చెబుతూ.. "ఫోన్ మీదేనని నిరూపించాలంటే పాస్‌వర్డ్ చెప్పండి" అంటూ బాధితులను మోసం చేస్తున్నారు.

**ఒక్కసారి ఫోన్ అన్‌లాక్ అయితే.. మొత్తం సమాచారం వారి చేతుల్లోకి**

ఫోన్ అన్‌లాక్ అయిన వెంటనే నిందితులు అందులోని సమాచారాన్ని జల్లెడ పడుతున్నారు. గ్యాలరీ, నోట్స్, మెసేజ్‌లు, వాట్సాప్ చాట్‌లను పరిశీలించి బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు.

**ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో భద్రపరిచే---**

- డెబిట్, క్రెడిట్ కార్డుల ఫొటోలు
- ఆధార్, పాన్ కార్డు కాపీలు
- బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు
- బ్యాంకింగ్ సంబంధిత నోట్స్
- పిన్‌లు, ఇతర రహస్య వివరాలు

వంటి సమాచారాన్ని నిందితులు సేకరించే అవకాశం ఉంది.

చోరీ చేసిన ఫోన్‌లో సిమ్ కార్డు ఉండటం నిందితులకు మరింత అవకాశం కల్పిస్తోంది. ఫోన్‌లోని యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ యాప్స్‌ను ఉపయోగించి, ఓటీపీల సహాయంతో పాస్‌వర్డ్‌లు లేదా యూపీఐ పిన్‌లను రీసెట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.ఆ తర్వాత బాధితుల బ్యాంక్ ఖాతాల నుంచి నగదును ఇతర ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, బాధితుడికి విషయం తెలిసేలోపే డబ్బును ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**మ్యూల్ అకౌంట్లు.. గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నగదు మళ్లింపు**

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నిందితులు నగదును నేరుగా తమ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేయకుండా వివిధ మార్గాలను ఉపయోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, డిజిటల్ వాలెట్లు, కమీషన్ ఆశ చూపి సేకరించిన మ్యూల్ అకౌంట్ల ద్వారా డబ్బును పలు దశల్లో మళ్లించి చివరకు నగదుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ఇది సాధారణ దొంగతనం కాదు.. పక్కా సైబర్ నెట్‌వర్క్**

హైదరాబాద్ పోలీసుల దర్యాప్తులో ఈ నేరాల వెనుక వ్యవస్థీకృత నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఒకరు రద్దీ ప్రాంతాల్లో బాధితులను గుర్తిస్తే.. మరొకరు ఫోన్ చోరీకి పాల్పడటం, ఇంకొందరు స్క్రీన్ లాక్ వివరాలను తెలుసుకోవడం, మరికొందరు సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకింగ్ యాప్స్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి విభాగాలుగా నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.చివరగా మ్యూల్ అకౌంట్లు, డిజిటల్ వాలెట్లు, ఇతర మార్గాల ద్వారా డబ్బును మళ్లించి నగదుగా మార్చుకునే నెట్‌వర్క్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**ఫోన్ పోయిందా? వెంటనే ఈ చర్యలు తీసుకోండి**

ఫోన్ చోరీకి గురైనప్పుడు లేదా పోయినప్పుడు బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.ముందుగా సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌ను సంప్రదించి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి.అలాగే కేంద్ర ప్రభుత్వ అధికారిక జజు×= పోర్టల్ ద్వారా మొబైల్ ×వీజు× నంబర్‌ను నమోదు చేసి ఫోన్‌ను బ్లాక్ చేయించాలి.బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు అనధికారికంగా బదిలీ అయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.

**సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక అవగాహన అవసరం**

ఈ తరహా నేరాల్లో వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న వ్యక్తులు లక్ష్యంగా మారే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని సీపీ వీసీ సజ్జనర్ సూచించారు.ప్రయాణ సమయంలో ఫోన్‌ను ఇతరులకు కనిపించేలా ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలని, స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్‌ను ఎవరూ గమనించకుండా చూసుకోవాలని సూచించారు."మీ ఫోన్ పోయినా తిరిగి ఇస్తామని ఎవరైనా చెప్పినా.. స్క్రీన్ లాక్ పిన్, పాస్‌వర్డ్, బ్యాంకింగ్ ఓటీపీలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకండి. ఫోన్ భద్రతతో పాటు అందులో ఉన్న బ్యాంకింగ్ సమాచారం కూడా అంతే కీలకం" అని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ ప్రజలకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటమే కాకుండా కుటుంబంలోని వృద్ధులకు ఈ తరహా నేరాలపై అవగాహన కల్పిస్తే హైబ్రిడ్ సైబ ర్ మోసాలను గణనీయంగా అడ్డుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

# పరిగి పట్టణ పరిశుభ్రతే ధ్యేయం..

## - మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్



**పరిగి, ఆగస్టు 27** మున్సిపాలిటీ పరిధిలో ఈ రోజు తెల్లవారుజామున మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ మార్నింగ్ విజిట్ నిర్వహించారు. ?ముందుగా మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల హాజరును స్వయంగా పరిశీలించిన ఆమె, పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షించారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై చెత్త, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని, డ్రైనేజీలు శుభ్రం చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగాలని సూచిస్తూ, ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేసి సహకరించాలని కోరారు. ?అలాగే వర్షాల నేపథ్యంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు సరిగ్గా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పరిగి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడమే ధ్యేయంగా సిబ్బంది పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న

## - కొప్పుల మహేష్ రెడ్డి



**దోమ, ఆగస్టు 27 (**
వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని, గ్రామస్తులతో పార్టీ నాయకులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ?ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ... "గుండాల్ గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఎంతో పవిత్రంగా జరిగింది. గ్రామంలో నూతన ఆలయ నిర్మాణం జరగడం, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఊరి ప్రజలందరూ ఐక్యంగా పాల్గొనడం ఎంతో సంతోషకరం. స్వామి వారి దివ్య ఆశీస్సులు గుండాల్ గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ ఆయురా రోగ్యాలతో, ఐశ్వర్యంతో తులతూగాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆధ్యాత్మిక భావన ఎంతగానో తోడ్పడుతుంది," అని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# వాలెట్ పార్కింగ్‌పై కన్నేసి కారు చోరీ

- పిస్తా హౌస్ వద్ద కారు ఎత్తుకెళ్లిన నిందితుడు అరెస్ట్
- రూ.9 లక్షల విలువైన ఆస్తి చోరీ.. రూ.8.90 లక్షల ఆస్తి స్వాధీనం
- అత్తాపూర్ పోలీసుల దర్యాప్తులో పాత నేర చరిత్ర వెలుగులోకి




**హైదరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**
వాలెట్ పార్కింగ్ సిబ్బంది రద్దీని ఆసరాగా చేసుకుని కారు తాళాలను చోరీ చేసి వాహనాన్ని ఎత్తుకెళ్లిన నిందితుడిని అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 22న అత్తాపూర్‌లోని పిస్తా హౌస్ సమీపంలో జరిగిన కారు చోరీ కేసును పోలీసులు ఛేదించారు.అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 925/2026, బీఎన్ఎస్ సెక్షన్ 305(బి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి నుంచి చోరీకి గురైన హ్యుందాయ్ ఐ20 కారుతో పాటు ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుడు ఎవరు?**

అరెస్టయిన నిందితుడిని సయ్యద్ మజర్ అలియాస్ షూటర్ అలియాస్ తక్లా అలియాస్ మజర్ ఖాన్, తండ్రి దివంగత సయ్యద్ నసీర్, వయస్సు 30 సంవత్సరాలు, వృత్తి నిరుద్యోగి, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా నివాసిగా పోలీసులు గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం నిందితుడు గతంలోనూ పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చిన అలవాటు నేరస్థుడిగా గుర్తించారు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చినప్పటికీ తన ప్రవర్తనలో మార్పు రాలేదని పోలీసులు తెలిపారు.

**వాలెట్ పార్కింగ్ సిబ్బందిని గమనించి..**

ఈ నెల 22న రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో పిస్తా హౌస్, పిల్లర్ నంబర్ 169, అత్తాపూర్ వద్ద కారు చోరీ జరిగింది.ఫిర్యాదుదారు తన బావమరిదితో కలిసి పిస్తా హౌస్‌కు భోజనం కోసం వచ్చి స్టార్రీ నైట్ రంగు హ్యుందాయ్ ఐ20 ఆస్టా కారు, నంబర్ ు+07ాూ2657ను వాలెట్ పార్కింగ్ సిబ్బందికి అప్పగించారు.అదే సమయంలో అక్కడికి వచ్చిన నిందితుడు వాలెట్ పార్కింగ్ సిబ్బంది కస్టమర్ల వాహనాలను పార్కింగ్ చేస్తూ, వాటి తాళాలను పార్కింగ్ కౌంటర్ వద్ద ఉంచుతున్న విషయాన్ని గమనించాడు. సిబ్బంది పనిలో బిజీగా ఉండటాన్ని కూడా గమనించి ఇదే అదనుగా భావించినట్లు పోలీసులు తెలిపారు.

**రెండు కారు తాళాలు చోరీ**

నిందితుడు వాలెట్ పార్కింగ్ సిబ్బందిని మాటల్లో నిమగ్నం చేసి కౌంటర్‌పై ఉన్న రెండు కారు తాళాలను చోరీ చేసి తన జేబులో పెట్టుకున్నాడు.అనంతరం ఒక్కో తాళాన్ని పరీక్షిస్తూ ఏ తాళం ఏ వాహనానికి సంబంధించినదో గుర్తించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పిస్తా హౌస్ పక్కనే ఉన్న బన్సాలీ మార్బుల్స్ దుకాణం సమీపంలో పార్క్ చేసి ఉన్న స్టార్రీ నైట్ రంగు హ్యుందాయ్ ఐ20 కారు తాళాన్ని నొక్కగా వాహనం లైట్లు వెలిగాయి.
కారు సమీపంలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం మరో చోరీ చేసిన కారు తాళాన్ని అక్కడే పడేసి, ఐ20 కారులోకి ప్రవేశించి ఇంజిన్ స్టార్ట్ చేసి అక్కడి నుంచి కారుతో పరారైనట్లు పోలీసులు తెలిపారు.రూ.9 లక్షల విలువైన ఆస్తి చోరీఈ ఘటనలో మొత్తం రూ.9 లక్షల విలువైన ఆస్తి చోరీకి గురైంది.
చోరీకి గురైన వాటిలో:

1. స్టార్రీ నైట్ రంగు హ్యుందాయ్ ఐ20 ఆస్టా కారు -- ు+07ాూ2657
2. 11 గ్రాముల బంగారు ఉంగరాలు -- 2
3. ఒక ల్యాప్‌టాప్‌ఉన్నాయి.

దర్యాప్తు చేపట్టిన అత్తాపూర్ పోలీసులు చోరీకి గురైన హ్యుందాయ్ ఐ20 కారుతో పాటు ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి విలువ సుమారు రూ.8.90 లక్షలుగా పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి ఒక ఒప్పో మొబైల్ ఫోన్ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**మిలాద్-ఉన్-నబీ సందర్భంగా స్వగ్రామానికి వెళ్లేందుకు..**

పోలీసుల విచారణలో నిందితుడు మిలాద్-ఉన్-నబీ సందర్భంగా తన స్వగ్రామానికి వెళ్లాలని భావించినట్లు వెల్లడైంది. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా, హలికేడ్ తాలూకా, హిలాల్‌పూర్ ప్రాంతంలోని నసీర్ షా దర్గా సమీపంలో తన తండ్రి సమాధి ఉందని, అక్కడికి వెళ్లేందుకు తన వద్ద తగినంత డబ్బు లేకపోవడంతో కారు చోరీ చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఉద్యోగం లేకుండా తిరుగుతున్న నిందితుడు దూర ప్రాంతానికి వెళ్లేందుకు డబ్బులు సమకూర్చుకునే ఉద్దేశంతో నాలుగు చక్రాల వాహనాన్ని చోరీ చేయాలని పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.గతంలోనూ పలు కేసులు
నిందితుడు గతంలోనూ పలు నేరాల్లో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు.అతడిపై నమోదైన కేసులు:
- గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 259/2024 -
- ఐపీసీ సెక్షన్ 392
- లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 199/2024 -- ఐపీసీ సెక్షన్ 392
- సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 461/2024 -- ఐపీసీ సెక్షన్ 302తో పాటు 34

2024లో నిందితుడిని అరెస్ట్ చేసి సంగారెడ్డి జిల్లా కంది జైలుకు రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

**వాలెట్ పార్కింగ్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి**

ఈ ఘటనతో వాలెట్ పార్కింగ్ నిర్వహణలో భద్రతా లోపాలపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కస్టమర్ల వాహనాల తాళాలను బహిరంగంగా ఉంచకుండా భద్రంగా నిర్వహించడం, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా పెంచడం, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచడం అవసరమని పోలీసులు సూచిస్తున్నారు.

**పోలీస్ బృందానికి అభినందనలు**

క్రైమ్ నంబర్ 925/2026 కేసును రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఐపీఎస్, అదనపు డీసీపీ కె.ఎస్. రావు, రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ టి. శ్రీనివాస్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు.అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ. సీతయ్య, డీఐ బి. రాజు నాయక్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రాజు నాయక్, కానిస్టేబుళ్లు రాఘవేందర్, తిరుపతి, జాకీర్ దర్యాప్తులో పాల్గొన్నారు.చోరీకి గురైన వాహనాన్ని, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని కేసును ఛేదించిన పోలీస్ బృందం పనితీరును ఉన్నతాధికారులు అభినందించారు. బృందానికి తగిన రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

# జై భీమ్ నగర్ కమిటీ హాల్ నిర్మాణంకు 20000వేల ఆర్థిక సహాయం అందచేసిన బిఆర్ ఎస్ యువ నాయకులు కట్ట సుందర్ బాబు,



**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 26**
జై బీమ్ నగర్ కమిటీ హాల్ నిర్మాణం కొరకు బి ఆర్ ఎస్ రాష్ట్ర యువనాయకులు కట్ట సుందర్ ను అధ్యక్షులు భాస్కర్  మరియు కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కట్ట సుందర్ జై భీమ్ నగర్ లో నిర్మాణంలో ఉన్న కమిటీ హాల్ పనులను పర్యవేక్షించి కమిటీ హాల్ నిర్మాణం కొరకు 20,000 ఇరవై వేల రూపాయలు నగదును కమిటీ సభ్యులకు అందజేసారు , కాలనీల అభివృద్ధి కోసం తన వంతు సహాయసహకారాలు ఎల్లపుడు ఉంటాయని తెలియజేయడం జరిగింది.

# ప్రశాంతంగా ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకలు

- పోలీసుల పటిష్ట బందోబస్తు.. ప్రశాంతంగా ముగిసిన వేడుకలు




**మెదక్,ఆగస్టు,26,**
మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. మెదక్ టౌన్, చేగుంట, శంకరంపేట-ఏ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు. ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పోలీసులకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను అధికారులు అభినందించారు.జిల్లాలో అన్ని పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహిస్తూ మెదక్ జిల్లా ప్రశాంతతకు ప్రజలు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

# తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పోస్టర్ ఆవిష్కరణ



**మెదక్,ఆగస్టు,26,**
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఎస్ ఎస్ సి మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాలపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ బుధవారం విద్యాశాఖాధికారి .రాజు , అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీమోహన్, విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రాజు, మెదక్ జిల్లా టాస్ కోఆర్డినేటర్ ఎ.వరప్రసాద్, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవకాశాన్ని చదువు మధ్యలో మానేసిన 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థుల కు మరియు యువతి యువకులకు చక్కని అవకాశం కాబట్టి వినియోగించుకోవాలని అన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

- చేయూత పెన్షన్లపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం
- బహుభాషల్లో ఆడియో, వీడియోలు, పాటల రూపంలో ప్రచారం
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**మెదక్,ఆగస్టు,26.:**
తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేలా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. అని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడించారు.సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్లు అర్హులైన వర్గాలకు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. అర్హత ఉన్నప్పటికీ సమాచారం లేకపోవడం లేదా దరఖాస్తు చేసుకోకపోవడం వల్ల ఏ ఒక్కరూ ఈ పథకం ప్రయోజనానికి దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించింది. అని వివరించారు.ఈ ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సెర్ప్ (సిరప్) ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో చేయూత పెన్షన్లపై అవగాహన కల్పించేలా తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఆడియోలు, వీడియోలు, పాటలను రూపొందించి విడుదల చేసిందన్నారు.. స్థానిక ప్రజల భాష, యాస, జీవన విధానానికి దగ్గరగా ఉండేలా రూపొందించిన ఈ ప్రచార సామగ్రి ద్వారా చేయూత పెన్షన్ల అర్హత, దరఖాస్తు ప్రక్రియ, చివరి తేదీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అని కలెక్టర్ వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ అర్హులైన వారందరికీ సమాచారం చేరేలా మీడియా, సామాజిక మాధ్యమాలు, స్థానిక ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సెర్ప్ కోరింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించింది.దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నందున అర్హత ఉన్న వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.అర్హత ఉన్న ఒక్క వ్యక్తి కూడా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోకుండా ప్రజలు, మీడియా, సామాజిక మాధ్యమాల సహకారంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. అని చెప్పారు.

# మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు వైభవంగా

- ●చార్మినార్ వద్ద పటిష్ట బందోబస్తు
- ●2 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు ప్రశాంతంగా ముగిసిన వేడుకలు







మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్ చార్మినార్ పరిసరాల్లో నిర్వహించిన ఊరేగింపు వైభవంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నగర పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ ఉన్నతాధికారులతో కలిసి చార్మినార్ వద్ద భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. ఊరేగింపు చార్మినార్ వద్దకు చేరుకోగానే ముస్లిం మత పెద్దలను ఆత్మీయంగా పూలమాలలతో సత్కరించి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఎల్లప్పుడూ శాంతిభద్రతలకు, పరమత సహనానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిదర్శనంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.నగరంలో ఏ పండుగ జరిగినా ప్రజలు పోలీసు శాఖకు ఎంతో బాధ్యతాయుతంగా సహకరిస్తున్నారని సీపీ తెలిపారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా సుమారు 2 వేల మంది పోలీసు సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఊరేగింపు మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, సాధారణ ప్రజలకు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు తెలిపారు. భద్రతతో పాటు ట్రాఫిక్ నిర్వహణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు.నగర ఘన సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగిస్తూ మిలాద్ ఉన్ నబీ పండుగను, ఊరేగింపును ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, యువత, ప్రజలు పోలీసులకు మరింత సహకారం అందించాలని సీపీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, అదనపు సీపీ క్రైమ్స్ ఎం. శ్రీనివాసులు, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీ టాస్క్ ఫోర్స్ వైభవ్ గైక్వాడ్, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే ప్రభాకర్, డీసీపీ సీసీఎస్ చైతన్య కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చింతగుర్తి--కొర్లబోడు రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం

- ●రూ.3 కోట్లతో వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభం
- ●గ్రామ ప్రజల చిరకాల స్వప్నం సాకారం.. రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని హర్షం



చింతగుర్తి గ్రామం నుంచి కొర్లబోడు వెళ్లే ప్రధాన రహదారిలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ వంతెన నిర్మాణ పనులను సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో, గ్రామ సర్పంచ్ తమ్మినేని ప్రియాంక కృషితో మంజూరైన బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ తమ్మినేని ప్రియాంక చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది.

చింతగుర్తి నుంచి కొర్లబోడు వెళ్లే మార్గంలో ఉన్న వాగు కారణంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు.బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. చింతగుర్తి నుంచి కొర్లబోడుతో పాటు పరిసర గ్రామాలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది.

వంతెన నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి గ్రామ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని గ్రామస్థులు తెలిపారు. వర్షాకాలంలో వాగు దాటేందుకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు కూడా సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. చింతగుర్తి గ్రామ ప్రజల చిరకాల స్వప్నం సాకారం అవుతున్నందుకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మినేని నాగేశ్వరరావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడు సుధగాని గోపయ్య, గ్రామ వైస్ ప్రెసిడెంట్ పేరపాక భరత్, గ్రామ పెద్దలు ఆలస్యం శ్రీనివాసరావు, కేతినేని సీతారామయ్య, షేక్ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.అలాగే వార్డు సభ్యులు పేరపాక లాలు, కొత్త కొమురయ్య, సుధగాని సంగయ్య, గొడ్ల వెంకన్న, లింగనబోయిన సునీత, అద్దంకి మమత, పటాన్ ఇస్మాయిల్ ఖాన్, భాగం లక్ష్మీనారాయణ, మాలోత్ వెంకన్న, ఆలస్యం సూరయ్య, కుర్ర రామకృష్ణ, పేరపోకు బుచ్చులు, జీడిమెట్ల వెంకటరమణ, అద్దంకి ముత్తయ్య, పల్లెలు ఉపేందర్, సురభి కొండలు తదితరులు పాల్గొన్నారు.బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత చింతగుర్తి, కొర్లబోడు ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల మధ్య రవాణా మరింత మెరుగుపడి, ప్రజల జీవన ప్రమాణాలు, స్థానిక ఆర్థిక కార్యకలాపాలు, గ్రామీణ అభివృద్ధికి దోహదపడుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

-బీఆర్ఎస్ యువజన నాయకుడు తిగుళ్ల రామేశ్వర్ గౌడ్







**సికింద్రాబాద్: ఆగస్టు 26 (పీపుల్స్ న్యూస్)**
మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే పవిత్రమైన మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ యువజన నాయకుడు తిగుళ్ల రామేశ్వర్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.మీలాద్ ఉన్ నబీ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముస్లిం సమాజం ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అడ్డగుట్ట డివిజన్ లాలాగూడలో నిర్వహించిన ముస్లిం సోదరుల ర్యాలీలో తిగుళ్ల రామేశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఇస్లామిక్ క్యాలెండర్‌లోని రబీ ఉల్ అవ్వల్ మాసంలోని 12వ తేదీన అనేక ముస్లిం సమాజాలు మీలాద్ ఉన్ నబీని జరుపుకుంటాయని తెలిపారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, ఆయన బోధనలను, మానవాళికి అందించిన సందేశాన్ని ఈ సందర్భంగా స్మరించుకుంటారని పేర్కొన్నారు.మీలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం, దువాలు నిర్వహించడంతో పాటు ప్రవక్త జీవిత విశేషాలు, బోధనలపై మతపెద్దలు ప్రసంగిస్తారని తెలిపారు.ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, దయ, కరుణ, సోదరభావం, నిజాయితీ, పేదల పట్ల సేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని రామేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పర్వేజ్, గౌస్, ఆశం, అజీమ్, పాలకూర శ్రీనివాస్, అమర్ బన్సోడే తదితరులు పాల్గొన్నారు.

# జైస్వాల్‌నే కాదు వైభవ్‌ని కూడా శిక్షించాల్సిందే..



**టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్**

కొలంబోలో జరుగుతున్న 2వ టెస్ట్ తొలి రోజు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్, అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వాగ్వాదం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ 17వ ఓవర్లో ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత జైస్వాల్ అతడి వైపు వెళ్లగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది.

ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు కదిలించాడు. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో ఇద్దరి తలలు తాకాయి. ఘటనపై ఐసీసీ చర్యలు తీసుకుని ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మంజ్రేకర్ మాత్రం ఈ శిక్ష సరిపోదని అభిప్రాయపడ్డారు. మైదానంలో శారీరకంగా తాకడం వంటి ఘటనలకు కఠినమైన చర్యలు అవసరమని ఆయన సూచించారు. ఈ సందర్భంగా యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన గత ఘటనను మంజ్రేకర్ ప్రస్తావించారు. ఈ ఏడాది జరిగిన ఏ జట్ల ట్రై-సిరీస్‌లో భారత్ ఏ తరపున ఆడిన వైభవ్.. శ్రీలంక ఏ ఆటగాళ్లతో ఘర్షణకు దిగిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఐసీసీ, బీసీసీఐ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంజ్రేకర్ కోరారు. యువ ఆటగాళ్లకు ఇటువంటి ప్రవర్తనను ఉపేక్షించడం సరైన సందేశం కాదని ఆయన పేర్కొన్నారు. ఎక్స్‌లో మంజ్రేకర్ స్పందిస్తూ ఐసీసీ, బీసీసీఐని ఉద్దేశించి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "వైభవ్ ఫర్ ఇండియా ఏ ఇటీవల.. ఇప్పుడు జైస్వాల్.. ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకునేలా చేస్తే, అదే ప్రవర్తనను మళ్లీ చేయడానికి వారికి అలవాటు పడేలా చేసినట్టే" అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు క్రీడకు మంచిది కాదని, ఆటగాళ్ల భవిష్యత్తుపైనా ప్రభావం చూపొచ్చని మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. శారీరక ఘర్షణలు జరిగినప్పుడు కఠినమైన శిక్షలు ఉండాలని ఆయన సూచించాడు. రెండో రోజు ఆట ప్రారంభానికి ముందు జైస్వాల్ తన చర్యను సమర్థించుకున్నాడు. "అతను ఏం అన్నాడో మీకు తెలియకపోతే తీర్పు ఇవ్వొద్దు. ఎవరైనా హద్దు దాటితే వారికి తెలియజేయాలి. ఇది భారత్.. మేం పోరాడతాం, సమాధానం ఇస్తాం" అని చెప్పుకొచ్చాడు. జైస్వాల్, ఫెర్నాండోలకు జరిమానాతో పాటు డీమెరిట్ పాయింట్లు పడినా, మంజ్రేకర్ మాత్రం మరింత కఠిన చర్యల అవసరాన్ని ముందుకు తెచ్చారు. వైభవ్ సూర్యవంశీ ఘటనను కలిపి చూస్తే, యువ ఆటగాళ్ల ప్రవర్తనపై క్రికెట్ బోర్డులు ఎలాంటి సందేశం ఇవ్వాలన్న ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది.

# గెలుపు ముంగిట భారత్!



- **తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 290**
- **ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక**
- **16 పరుగుల ఆధిక్యంలో శ్రీలంక**
- **సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్**

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ఆసియా గేమ్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

- **సెప్టెంబర్ 18న టీమ్ఇండియా మహిళలు మొదటి మ్యాచ్**




2026 ఆసియా గేమ్స్ నుంచి అదిరే అప్డేట్ వచ్చింది. జపాన్ వేదికగా జరగనున్న ఈ గేమ్స్?లో క్రికెట్ పోటీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ముందుగా మహిళల జట్ల మధ్య పోటీలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత పురుషుల కాంపిటీషన్ ఉండనుంది. ఈ మ్యాచ్‌లన్నింటినీ జపాన్‌లోని కొరోగి అథ్లెటిక్ పార్క్‌లో నిర్వహించనున్నారు. మహిళల క్రికెట్ పోటీల్లో భారత్, శ్రీలంక, జపాన్, మలేసియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, థాయ్‌లాండ్ జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్‌లు సెప్టెంబర్ 17న షురూ కానుండగా, టీమ్ఇండియా మహిళలు తమ మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 18న ఆడనుంది. ఈ మ్యాచ్ జపాన్‌తో జరగనుంది.ఆ తర్వాత 20, 22 తేదీల్లోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 22న జరుగుతుంది, అలాగే కాంస్య పతక పోరు కూడా అదే రోజు ఉంటుంది. ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. గత సీజన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన టీమ్ఇండియా మరోసారి అదే ప్రదర్శనను రిపీట్ చేయాలని ఆశిస్తోంది. పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్‌తోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు టోర్నమెంట్‌లో నేరుగా అర్హత సాధించాయి. ఈ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడుతాయి. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, జపాన్, నేపాల్ టీమ్స్‌ను 'గ్రూప్ -సా'లో ఉంచారు. హాంకాంగ్, చైనా, మలేసియా, ఒమన్ జట్లను 'గ్రూప్ దీ'లో చేర్చారు. ఈ గ్రూపులలో విజేతలుగా నిలిచిన జట్లు, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో తలపడతాయి. గ్రూప్ స్టేజ్‌లో ఓడిపోయిన జట్లు పోటీ నుంచి నిష్క్రమిస్తాయి. ఇక పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న ప్రారంభమవుతాయి. ముందుగా గ్రూప్ ఏ, గ్రూప్ బీలోని జట్లు పోటీపడతాయి. ఆ తర్వాత భారత 28న తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే అది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కాబట్టి ప్రత్యర్థి ఎవరో ఇంకా తేలలేదు. అయితే శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమ్ఇండియా ఈ పోటీలో ఆడనుంది. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# టాప్ లేపిన మిచెల్ స్టార్క్, రిషభ్ పంత్!

- **ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల**

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ దుమ్మురేపాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను వెనక్కినెట్టి మిచెల్ స్టార్క్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మిచెల్ స్టార్క్ 872 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా(862), మ్యాట్ హెన్రీ(861) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్(807) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. రెండో టెస్ట్‌లో 10 వికెట్లు పడగొట్టిన స్టార్క్.. రెండు స్థానాలు ఎగబాకి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఫస్ట్ బాల్‌కే మిచెల్ స్టార్క్ వికెట్ పడగొట్టాడు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఈ ఇద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ తృటిలో శతకాన్ని చేజార్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రదర్శనతో రిషభ్ పంత్(711) ఆరు స్థానాలు ఎగబాకి టాప్-10లోకి వచ్చి 8వ ర్యాంకు అందుకోగా.. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన శుభ్‌మన్ గిల్(711)8వ స్థానానికి పడిపోయాడు. రెండు టెస్ట్‌ల్లో విఫలమైన యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్(874), జో రూట్(850), స్టీవ్ స్మిత్(840), ట్రావిస్ హెడ్(811), టెంబా బవుమా(775) టాప్-5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా(428)తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. శ్రీలంకతో తొలి టెస్ట్‌లో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.




# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చెమటోడుస్తున్న ప్లేయర్లు




టీమిండియా అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్, శ్రీలంక జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ-ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బెంగళూరులోని వర్కౌట్స్, ట్రైనింగ్ సెషన్లకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గాయం నుంచి వేగంగా కోలుకుంటూ పునరావాస శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్-బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని.. ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే.. త్వరలోనే భారత వైట్-బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.



# గర్భంతోనూ జిమ్‌లో సమంత.

గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది. సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది.

ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది..తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది.

కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది.

చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చుని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.

# ‘టాక్సిక్’ దూకుడు..

## మధ్యాహ్నానికే ‘ధురంధర్‘ను దాటేసిన యశ్ మూవీ

యశ్ నటించిన ‘టాక్సిక్’కు ఆరంభంలో ఎదురైన విమర్శలు, ఆన్‌లైన్ ట్రోలింగ్ నేడు బాక్సాఫీసు ప్రభంజనానికి ఏమాత్రం అడ్డుకాలేదు. బుధవారం ఉదయం నుంచే సినిమా థియేటర్ల వద్ద సందడి కనిపించింది. మధ్యాహ్నానికి ముందే రణ్‌వీర్ సింగ్ ‘ధురంధర్’ తొలిరోజు భారత్‌లో నెట్ వసూళ్లను ‘టాక్సిక్’ దాటేసింది.

ఓనం సెలవును టార్గెట్ చేస్తూ ‘టాక్సిక్’ ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమా హింస, రొమాంటిక్ సన్నివేశాలపై విడుదలకు ముందు చర్చ జరిగినా ప్రేక్షకుల స్పందన మాత్రం బలంగా కనిపించింది. ఉదయం షోలకే పలు ప్రాంతాల్లో థియేటర్లు కళకళలాడాయి.




‘సాక్‌నిల్క్’ లెక్కల ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.40 గంటలకు ‘టాక్సిక్’ ఇండియా నెట్ వసూళ్లు రూ.31.76 కోట్లకు చేరాయి. 9,003 షోల ద్వారా ఈ మొత్తం వచ్చింది. ఇండియా గ్రాస్ రూ.37.48 కోట్లుగా నమోదైంది.

కన్నడ 2డీ వెర్షన్ 77.69 శాతం ఆక్యుపెన్సీతో ముందుంది. తెలుగు వెర్షన్ 57.08 శాతం, తమిళం 45.25 శాతం, మలయాళం 40.13 శాతం, హిందీ 37.85 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి.

రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్’ తొలిరోజు ఇండియాలో రూ.28.60 కోట్ల నెట్, రూ.33.60 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ‘టాక్సిక్’ ఉదయం షోలతోనే ఆ మార్కును అధిగమించింది.

యశ్ ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.100–120 కోట్ల వసూళ్లు సాధించొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆ స్థాయికి చేరితే అతిపెద్ద ఇండియన్ ఓపెనర్లలో ఒకటిగా నిలుస్తుంది. రూ.100 కోట్ల మార్కును దాటితే ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో కన్నడ చిత్రంగా నిలుస్తుంది.



# యంగ్ హీరోల కొత్త ట్రెండ్‌లోకి కార్తికేయ!

టాలీవుడ్‌లో హీరోలు కేవలం యాక్టింగ్‌కే రిమితం కాకుండా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంటి విభాగాల్లోనూ తమదైన ముద్ర వేయాలని చూస్తున్న ట్రెండ్ క్రమంగా బలపడుతోంది. ఒకప్పుడు హీరోగా కెరీర్‌లో సెటిలైన తర్వాతే డైరెక్షన్ వైపు అడుగులు పడేవి. కానీ ఇప్పుడు యంగ్ హీరోలు తమకు నచ్చిన కథలను తామే చెప్పాలనే ఆలోచనతో కెమెరా వెనక్కి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మారుతున్న ట్రెండ్‌లో ఇప్పుడు కార్తికేయ కూడా చేరబోతున్నారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కార్తికేయ, ఇకపై కేవలం హీరోగా మాత్రమే కాకుండా సినిమా మేకింగ్‌లోని ఇతర విభాగాలపైనా దృష్టి పెట్టబోతున్నారనే డిస్కషన్ మొదలైంది. ముఖ్యంగా కథను సెలెక్ట్ చేసుకోవడం నుంచి దాన్ని తెరపైకి తీసుకురావడం వరకు మొత్తం క్రియేటివ్ రెస్పాన్సిబులిటీ తీసుకోవాలనే ఆలోచన యంగ్ హీరోల్లో పెరుగుతున్న నేపథ్యంలో కార్తికేయ డెసిషన్ కూడా అదే దిశలో కనిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో నటుల నుంచి డైరెక్టర్లుగా మారిన ఉదాహరణలు చాలానే ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణ, విజయ నిర్మల వంటి దిగ్గజాల నుంచి అవసరాల శ్రీనివాస్, విశ్వక్‌సేన్ వంటి సమకాలీన నటుల వరకు పలువురు యాక్టింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే ప్రస్తుత తరం హీరోలలో ఈ ఆలోచనకు మరో కొత్త కోణం కనిపిస్తోంది. తమ మార్కెట్‌కు తగ్గ కథ కోసం ఎదురు చూడటం కంటే, తమకు నమ్మకం ఉన్న కథను తామే డెవలప్ చేసి ఆడియన్స్ ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం పెరుగుతోంది. దీనికి మరిన్ని ఎగ్జాంపుల్స్ కూడా కనిపిస్తున్నాయి. ఆల్రెడీ కిరణ్ అబ్బవరం డైరెక్టర్ గా మారి సినిమా చేస్తుండగా, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కూడా ఇదే బాటలో వెళ్తూ, తన స్వీయ దర్శకత్వంలో నటిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాల నటనా ప్రయాణం తర్వాత రామ్ డైరెక్షన్ లోకి అడుగుపెడుతున్నారు. యాక్టర్ గా సంపాదించిన ఎక్స్‌పీరియెన్స్‌ను ఇప్పుడు డైరెక్టర్ గా ఉపయోగించుకోవాలనే ప్రయత్నం ఈ మారుతున్న ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది.

# కృతి సనన్ డ్రెస్‌పై దుమారం..

## రాఖీ యాడ్ ను వెనక్కి తీసుకున్న జ్యువెల్లరీ బ్రాండ్



ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ ‘జీవ‘ తన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనను అన్ని మీడియా వేదికల నుంచి ఉపసంహరించుకుంది. బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఈ యాడ్‌లో ఆమె ధరించిన దుస్తులు, ప్రచార కాన్సెప్ట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వివాదంపై ‘జీవ‘ బుధవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని సంస్థ పేర్కొంది. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడంతో పాటు, పెంపుడు జంతువులతోనూ ఆ అనుబంధాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ప్రచారాన్ని రూపొందించినట్లు వివరించింది. అయితే, ఇది అనుకోకుండా కొందరి మనోభావాలను దెబ్బతీసిందని అంగీకరించింది. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది.సుమారు 36 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో కృతి సనన్, బ్రాలెట్ తరహా బ్లౌజ్‌తో కూడిన ఇండో–వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించారు. తన సోదరుడికి, ఒక పెంపుడు శునకానికి ఆమె రాఖీ కడుతున్నట్లు అందులో చూపించారు. ఆమె వస్త్రధారణతో పాటు, రక్షాబంధన్ సంప్రదాయంలో పెంపుడు జంతువును భాగం చేయడంపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.ఈ ప్రకటనపై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ‘లోదుస్తులు ధరించి సోదరుడికి రాఖీ కడతారా?‘ అని ప్రశ్నిస్తూ, ఇది ఉద్దేశపూర్వకంగా అసభ్యంగా ఉందని వ్యాఖ్యానించారు. నెటిజన్ల నుంచి కూడా పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో, సదరు జ్యువెల్లరీ బ్రాండ్ ఈ ప్రకటనను వెనక్కి తీసుకుంది.



# నా అంత సాధించాక మాట్లాడండి..

## శత్రువులకు క్వీన్ మాస్ వార్నింగ్!

నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తనపై విమర్శలు గుప్పిస్తున్న పలువురు బాలీవుడ్ ప్రముఖులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం స్టిల్ ఫోటోగ్రాఫర్లతో మాట్లాడిన కంగన .. కెరీర్‌లో ఎలాంటి విజయం సాధించని వారు తనకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తోటి నటీనటులు, ప్రముఖులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆశుతోష్ రాణా, సోనూ సూద్, రాఖీ సావంత్, తాప్సీ పన్నులను పేరుపేరునా ప్రస్తావిస్తూ కంగనా అసహనం వ్యక్తం చేశారు. నన్ను కుక్కలా మొరుగుతానని ఆశుతోష్ రాణా అంటారు. ఎలా నడుచుకోవాలో నేర్చుకోవాలని సోనూ సూద్ సలహాలు ఇస్తారు. రాఖీ సావంత్ నా వ్యక్తిత్వాన్ని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేస్తుంది. ఇక తాప్సీ పన్ను అయితే నా తల్లిదండ్రులు.. నా పెంపకం.. నా నేపథ్యాన్ని వరుసగా అవమానిస్తూనే ఉంది! అని కంగనా మండిపడ్డారు తమ కెరీర్‌లో తాను సాధించిన విజయంలో కనీసం 1 శాతం కూడా సాధించలేని వారి ఉచిత సలహాలు వినేందుకు తాను సిద్ధంగా లేనని కంగనా స్పష్టం చేశారు. నా లైఫ్‌లో నేను సాధించిన విజయంలో ఒక శాతం కూడా సాధించని వారి జ్ఞానాన్ని నేను వినను. పరిశ్రమలో విఫలమై.. ఆదరణ లేని కొందరు వ్యక్తులు ఎప్పుడూ నన్ను తిడుతూనే ఉంటారు. వారు మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఇదంతా చేస్తున్నారు. ముందు నా స్థాయికి ఎదగండి.. ఆ తర్వాత మాట్లాడండి. నాకంటే ఎక్కువ విజయం సాధించిన వారు చెబితేనే నేను వింటాను.. ఇక సహించేది లేదు! అని వ్యాఖ్యానించారు.జెన్ జెడ్ .జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలపై కంగనా చేసిన కామెంట్లు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కొంతమంది యువకులను, మహిళలను –జనరేషన్ గట్టర్– అని కంగనా సంబోధించడాన్ని సోనూ సూద్ తప్పుపట్టారు. అదేవిధంగా తాప్సీతోనూ కంగనకు పాత విభేదాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో 2014లోనే భారత్‌కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని కంగనా అన్న మాటలపై రాఖీ సావంత్ పంచ్ లు విసిరారు.

# గోల్డెన్ గ్లోబ్ అవార్డును పగలగొట్టి అబద్ధం చెప్పా: ఇయాన్ మెక్‌కెల్లెన్



దిగ్గజ నటుడు సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్ తన కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు సంబంధించి తాను చెప్పిన ఒక అబద్ధాన్ని తాజాగా వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఆ పురస్కారం మెమొంటో విరిగిపోవడంతో, అది కనిపించడం లేదని నిర్వాహకులకు అబద్ధం చెప్పినట్లు ఆయన అంగీకరించారు. 1997లో “రస్పుటిన్: డార్క్ సర్వెంట్ ఆఫ్ డెస్టినీ“ చిత్రంలో అద్భుత నటనకు గానూ మెక్‌కెల్లెన్ ఉత్తమ సహాయ నటుడిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డును దక్కించుకున్నారు. త్వరలో ప్రసారం కానున్న ‘టీ విత్ జూడీ డెంజ్ ఫీచరింగ్ సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్‘ అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.“ఆ గోల్డెన్ గ్లోబ్ ప్రతిమను ఎలా తయారు చేశారో తెలుసుకోవాలనే కుతూహలంతో దాని కింద ఉన్న ఒక స్క్రూను విప్పాను. వెంటనే ఆ పురస్కారం ముక్కలైపోయింది. దాన్ని నేను తిరిగి అమర్చలేకపోయాను. అదే సమయంలో నా పేరును ఆ ప్రతిమపై చెక్కడం కోసం దానిని తిరిగి పంపాలని నిర్వాహకులు కోరారు. దాంతో అది కనిపించడం లేదని వారికి అబద్ధం చెప్పాల్సి వచ్చింది“ అని మెక్‌కెల్లన్ వివరించారు.మెక్‌కెల్లెన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం ఇదే కావడం విశేషం. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో ప్రముఖ నటి డేమ్ జూడీ డెంజ్ కూడా తన ఆస్కార్ అవార్డుకు సంబంధించిన ఒక పొరపాటును పంచుకున్నారు. స్కై ఆర్ట్స్ ఛానల్‌లో ఈ కార్యక్రమం త్వరలో ప్రసారం కానుంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com